## 23వ పాఠం

## సజ్జనుల సమాధుల విషయంలో హద్దులుమీరటం, వాటిని బహుదైవారాధనకు అనువుగా మార్చటం

అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రార్థించుకున్నారు: "ఓ అల్లాహ్! నా సమాధిని ప్రజలు పూజించే విగ్రహంగా చేయనీకు. ప్రవక్తల సమాధులను ప్రార్థనాలయాలు (సాష్టాంగ ప్రణామ స్థలాలు)గా చేసుకునేవారిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడు గాక!" (ముఅత్తా ఇమామ్ మాలిక్)

**"అఫరఐతుముల్లాత వల్ ఉజ్జా"** (ఏమిటి, మీరు లాత్, ఉజ్జాలను గాని చూశారా?) (53 : 19) అనే ఖుర్ఆన్ ఆయతుకు తాత్పర్యంగా ఇబ్నె జరీర్ తబ్రీ (రహ్మలై) సుఫియాన్, మన్సూర్‌ల ఉల్లేఖనం ద్వారా ఇలా వివరించారు–

లాత్ (అనే ఒక సత్పురుషుడు) హజ్జ్ యాత్రికులకు మంచి సేవలందించేవాడు. యవలు లేక గోధుమ పిండితో, నేతితో చేయబడిన అంబలి (సవీఖ్)ని తయారు చేసి హాజీలకు త్రాపించేవాడు. అతను మరణించిన తరువాత ప్రజలు అతని గౌరవార్థం అతని సమాధిని పటిష్టపరచి, సమాధి సేవకులు (ముజావర్లు) అయి కూర్చున్నారు. ఆ విధంగా ఆ సత్పురుషుని సమాధి కాస్తా ప్రార్థనాలయంగా మారి పోయింది."

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : సమాధులను సందర్శించే స్త్రీలు శాపగ్రస్తులవుతారని దైవప్రవక్త (స) చెప్పారు. సమాధులపై ఆరాధనాలయాలను నిర్మించి, అక్కడ దీపాలు వెలిగించేవారు కూడా శాపగ్రస్తులేనని ఆయన (స) పలికారు. (అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్ను మాజా, నసాయిలు ఈ హదీసును సమర్థించారు)

https://teluguislam.net

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- ప్రజల్లో విగ్రహారాధన ఎలా చోటు చేసుకుంటుందో ఇందులో వివరించబడింది.
- ప్రార్థనాలయాలు ఎలా పుట్టుకువస్తాయో, చిల్లర దైవాల పూజా పునస్కారాలు ఎలా మొదలవుతాయో కూడా ఇందులో విశదీకరించబడింది.
- ప్రవక్త (సఅసం) తనకు దేనివల్ల కీడు కలుగుతుందని అనుమానించారో దాన్నుండి అల్లాహ్‌నే శరణువేడారు.
- “ఓ అల్లాహ్! నా సమాధిని ప్రజలు పూజించే విగ్రహంగా చేయకు” అని ప్రవక్త (స) వారు ప్రార్థించటమేగాక, గత సమాజాల వారు తమ ప్రవక్తల సమాధులను పూజా స్థలాలుగా మార్చిన సంగతిని కూడా ప్రస్తావించటం గమనార్హం.
- ఇలాంటి పనులు చేసిన వారిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతుందని చెప్పటం కూడా గమనించదగిన విషయమే.
- అరబ్బులలో సుప్రసిద్ధుడైన లాత్ అనే వ్యక్తి విగ్రహం ఎలా తయారయిందో, దానిపూజ అసలు ఎలా మొదలయ్యిందో వివరించటం చాలా ముఖ్యమైన అంశం.
- ‘లాత్’ అనేది ఒక సజ్జనుని పేరు ఆ సమాధిలో ఉన్న వ్యక్తి పుణ్యాత్ముడవటం చేత ప్రజలు దానికి పవిత్రతను ఆపాదించి సమాధి సేవలు మొదలెట్టారు. ఆ సేవలే ఆరాధనలుగా, అర్చనలుగా మారిపోయాయి. ‘షిర్క్’ ప్రతి చోటా వ్యాపించేది ఇలాగే.
- సమాధులను సందర్శించే స్త్రీలు, సమాధులపై దీపాలు వెలిగించే

వారు శాపగ్రస్తులవుతారని ప్రవక్త మహనీయులు (సఅసం) చెప్పటం గమనించదగిన విషయం.

## మోడల్ ప్రశ్నలు

1) సజ్జనుల సమాధుల విషయంలో హద్దుమీరి ప్రవర్తించటం ఎంత వరకు సమంజసం?
2) లాత్ ఎవరు? ఆయన మరణం తర్వాత ప్రజలు ఆయన సమాధి పట్ల ఎలా ప్రవర్తించారు?

## ఖాళీలు పూరించండి

1) సమాధులను సందర్శించే స్త్రీలు.......... అవుతారని ప్రవక్త(స) అన్నారు.
2) సమాధులపై........................ వెలిగించేవారు............ అవుతారు.